


# 'నను పాలింప..'

సముద్రాల
రామానుజాచార్యులు

సాయంత్రం ఆరు గంటల వేళ అందరూ ముస్తాబై సినిమాకు పోతూ ఉంటే జాలిగా చూచి, వారగా ఒదిగి కూర్చున్నాడు రంగడు.

వాకిటి కటకటాల గేటు దాటి పోలేని వాడికి ఆ ఇల్లే ప్రపంచం.

వాకిటిలో ఉన్న పూల మొక్కలు వాడికి ప్రకృతి. అమ్మ అనురాగమే అమృత వర్షం వాడికి. నాన్న ఆదరనే వాడికి తృప్తి. వాడిని చూస్తే చెప్పలేని హృదయపు అగాధాలు, కన్నీటి జలపాతాలు కన్న తలిదండ్రులకే తెలుసు. అందుకే రంగడంటే వా రిద్దరికీ రెండు కళ్ళు.

అక్కయ్యతోబాట ఆమె పిల్లలు, అన్నయ్య, చంటి పిల్లవాడితో వదిన, తమ్ముడు, అంతా సినిమాకి బయలుదేరారు ఆ సాయంత్రం. వా ళ్ళందరూ అలా సినిమాకు సిద్ధం కావటం చూసి మనసులో కోరిక ఆపుకోలేకుండా ఉన్నాడు రంగడు. పిల్లలు రంగు రంగుల బట్టలు వేసుకుని ఉత్సాహంగా గంతులు వేస్తున్నారు. ముందుగా వెళ్ళి టిక్కెట్లు తెచ్చిన తమ్ముడు అందరినీ ఆత్రంలో ముంచెత్తుతున్నాడు.

తనకూ సినిమా చూడాలనుంది.

ఎలా? ఎవరి నడగడం? అన్నయ్య నడిగితే?

నిలువుటద్దం ఎదురుగా నిలబడి తల దువ్వు కుంటున్న అన్నయ్య దగ్గరికి వెళ్ళాడు రంగడు, డేకురుకుంటూ.

"అన్నయ్యా! నన్నుకూడా తీసుకెళ్ళవూ?" ప్రాధేయపడ్డాడు.

"నువ్వెక్కడికిరా! హాలు చాలా దూరం—తెలుసా? మరోకసారి ఎప్పుడైనా చూద్దువు గానిలే" అని కసిరాడు.

దిగులుగా అన్నయ్య వేపు చూసి, చేతో అతని కాళ్ళు పట్టుకుంటూ బతిమలాడాడు.

"ఏంరా! నీ క్కాదూ చెప్పేది? బట్టలు ఖరద చేస్తూ, అడగడ మెందుకు? వద్దని చెప్తుతూంటే వినవేం? కుంటితనానికి తోడు చెవుడుకూడా వచ్చిం దేమిటి?" అంటూ కోపంగా విదిలించాడు.

రంగడి మనసు చివుక్కుమంది.

కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. బిక్క మొహం వేశాడు.

అంతలో వదిన లోనికి వస్తూ, "ఏమి టంటా డండీ వీడు?" అని అడిగింది.

"సినిమాకి వస్తాట్ట." నవ్వాడు అన్నయ్య.

"బాగుంది సంబరం! అవిటి వెధవ—వీడికి సినిమాకూడా కావాలి. ప్రతిదానికీ నేనూ ఉన్నా నంటూ పిల్లిలా కాళ్ళలో పడతాడు. వెళ్ళమనండి, చాలు. వీణ్ణి తీసుకువెళితే నేను రాను—తెలుసా?" అంది చీదరించుకుంటూ.

పక్క గుమ్మం దగ్గర నించుని వింటున్న రంగడి తల్లి అనసూయమ్మ మనసు కాల్చిన ఇనపరేకు తగిలి నట్టుగా కరేల్మంది.

'అక్కయ్యను అడిగితే తప్పక తీసుకు వెళుతుంది' అనుకుంటూ మెల్లగా గుమ్మం దాటి వరండాలో కూర్చుని జడ వేసుకుంటున్న అక్కయ్యను చేరాడు రంగడు.

"ఏమిట్రా, రంగా? నీ సరదా ఏమిటిరా, చిన్న పిల్లాడిలా?"

"అక్కయ్యా! నన్ను సినిమాకి తీసుకెళ్ళవూ?" అడిగాడు మెల్లగా.

"నువ్వు రావులేరా. నిన్ను రిక్షాలో తీసుకువెళితే పిల్లలంతా ఏడుస్తారు. నువ్విప్పుడు వద్దురా" అంది.

"అక్కా! నేను చేతులతో డేకురుతూ వస్తా నక్కా."

"కింద డేకురుతూ వస్తావా? ఛ, ఛ!"

రంగడు చిన్నబోయాడు. తమ్ముడు సినిమాకి

వెళ్ళే సందడిలో తన వూసే పట్టించుకోకుండా దొరకకుండా పరుగెత్తి పారిపోయాడు.

ఎవరూ వినిపించుకోలేదు వాడి మాట.

జాలి గొలిపే వాడి స్థితి తలుచుకుంటూ అక్కడ మరి నిలబడ లేకపోయింది అనసూయమ్మ. వంటింట్లోకి వెళ్ళి కళ్ళు తుడుచుకుంది.

రంగడి కేమీ తోచలేదు.

తన స్థితి తలుచుకుంటూ స్తబ్దంగా కూర్చుని కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

అలుముకున్న సంజ చీకట్లు తన భవిష్యత్తు ఇలాగే ఉంటుందని చెప్పినట్లయింది వాడికి.

అందరూ వెళ్ళిపోయాక వాకిట్లోకి వచ్చిన అనసూయమ్మ లైటు వేసి రంగడిని చూసింది.

వాడి ముఖంలో కన్నీటి చారలు ఆ తల్లి ప్రేవును కదిలించి వేశాయి.

"రంగా! ఏడుస్తున్నావా? నేను లేనురా నీకు?" అంటూ వాణ్ణి చేరదీసి ఓదార్చింది.

అమ్మ గుండె చల్లదనానికి వాడి మనసు కరిగి పోయింది.

"అమ్మా!" దుఃఖం ఉప్పొంగి ఆమె ఒడిలో తల దాచుకున్నాడు రంగడు.

"భగవాన్!" బాధగా నిట్టూర్చింది అనసూయమ్మ.

* * * *

ఇంటికి వచ్చిన తండ్రి శంకరం గారి వద్దకు మెల్లగా చేరాడు రంగడు.

"నాన్నా! నన్నెవరూ సినిమాకి తీసుకు వెళ్ళలేదు, నాన్నా" అంటూ మనసులోని ఆవేదనను తండ్రికి విన్నవించుకున్నాడు.

"పోనీరా! నేను తీసుకువెళతాలే!" అంటూ వాడి తల నిమిరారు ఆయన. తండ్రి చూపే ఆదరణ వాడికి వూరట కలిగించింది. మళ్ళీ వాకిట్లో గేటు దగ్గరికి దేకురుతూ వెళ్ళిపోయాడు. వాడి వేపు చూస్తూ బాధగా భార్యతో అన్నారు శంకరం గారు: "వీడెలా బ్రతుకుతాడో! భగవంతుడు సంతా నాన్ని ఇచ్చి, వీణ్ణి అవిటివాణ్ణి చేశాడు. మనం ఉన్నప్పుడే వీడి సంగతి ఎవరికీ పట్టడం లేదు. మనం ఇద్దరం పోయాక వీడి బతుకు ఎలా గడుస్తుందో? అభిమానించకపోయినా, వాడిని మన ముందే హీనం చేస్తున్నారు." అతని కంఠం బొంగురు పోయింది.

"అవునండీ. వీడంటే అందరికీ చులకన. నాలుగు రోజుల కిందట మీరు ఇంట్లో లేరు. వీణ్ణి కూర్చో పెట్టి, గుడ్డ పరిచి ముష్టివాడి లాగా డబ్బులు వేస్తూ ఎంత ఏడిపించారో! పిల్లలు వాడి నలా ఏడిపిస్తూ ఉంటే పెద్దలంతా వినోదంగా చూస్తూ వూరుకున్నారు. నేను కలుగ జేసుకుని అదమాయించ బోయాను. వాళ్ళ గోల వాళ్ళదే. నా మాట ఎవరికి వినిపిస్తుంది? మన వాళ్ళే వాడి నిలా చూస్తే ఇక పై వాళ్ళు ఎంత హీనంగా. . ." ఆమె దుఃఖంతో మరి మాట్లాడలేక పోయింది. ఆమె కళ్ళు నీటి వాగు లైనాయి.

"దేనికైనా మనమేం చెయ్యగలం, అనసూయా?" దీనంగా అన్నా రాయన.

"ఏం చెయ్యలేమని నిరాశగా వూరుకుంటే ఎలా ఉండాలి?" అం దామె.

వా రిద్దరి మధ్య నిశ్శబ్దం తాండవించింది.

రంగడిని ఏం చెయ్యాలి? వాడి భవిష్యత్తు ఏమిటి? ఇదే వాళ్ళ మనసులో ఆలోచన.

* * *

శంకరంగారు పండగకు అందరికీ బట్టలు కుట్టించారు. రంగడికి చొక్కా, నిక్కరూ కుట్టించారు. రంగడి వేదన అంతా ఒక్కటే. అందరూ పాంట్లు వేసుకుంటూరు—తన తోటివాళ్ళు. బూట్లుకూడా తొడుక్కుంటారు. తన కా అదృష్టం లేదు. అందరి కాళ్ళ వేపు ఎగా దిగా చూసి తన దురదృష్టానికి క్రుంగి పోతాడు రంగడు.

పండుగ దినాలు సరదాగా గడిచిపోయాయి. రంగడు ఎవరికీ అక్కర లేకపోయినా, వారంతా వాడికి కావాలి. పిల్ల లంతా తన చుట్టూ తిరిగి ఆడుకుంటే వాడి ఆనందానికి మేర ఉండదు.

పిల్ల లంతా వాడిని ఏడిపిస్తారు. అమ్మా, నాన్నా తప్పించి, అందరూ వినోదం తిలకించి నవ్వుకుంటారు. కాని, వాడికి తన నేమన్నా, తనను చూసి నవ్వినా బాధ అనిపించదు. కాని, తనను హీనంగా, పురుగులా చూచి, దూరం పొమ్మంటే మాత్రం ఏడుపు వస్తుంది.

అక్కయ్య, అన్నయ్య ఎవరి వూళ్ళకు వారు ప్రయాణ మయ్యారు. వాళ్ళు బయలుదేరుతూ ఉంటే రంగడికి తీరని బాధ కలిగింది. తను ఎక్కడికీ వెళ్ళలేడు. కాని, వాళ్ళందరూ దూరంగా వెళ్ళి పోతారు. ఎన్నాళ్ళకు కనిపిస్తారో తనకు! అన్నయ్య కొడుక్కు మాటలు రావు, నడక రాదు. బొద్దుగా, బంతిలా తన చుట్టూ ఒంగురుతూ ఆడుకునే ఆ పసివాడుకూడా రేపటి నుంచి మరి కనిపించడు. వా డలా తన చుట్టూ ఆడుతూ ఉంటే, తనకు ఏనుగెక్కినంత సంబరంగా ఉంటుంది. వాడికి తినేందుకు ఏమైనా పెట్టాలనిపిస్తుంది. కాని, తన దగ్గర ఏమున్నాయి కనక!

భోజనాలు ముగించి, పెట్టె బేడా సర్దుకుని వాళ్ళంతా గుమ్మం దిగి పోతూంటే, వెర్రిగా చూచి కన్నీళ్ళు పెట్టుకున్నాడు రంగడు.

వెళ్ళి వస్తామని ఒక్కరూ వాడితో చెప్పలేదు.

అమ్మా, నాన్నా వాళ్ళతోబాటు వెళ్ళి, బస్సు ఎక్కించి వచ్చారు.

ఉదయాన్నే కమ్మిన మేఘంలా ఆ వేళ అంతా వాడిని విచారం వదలలేదు.

* * * *

కాలగర్భంలో మరొక ఏడాది గిరుక్కున తిరిగింది.

మళ్ళీ పండగ వచ్చింది.

ఈ సారి కొడుకు, కోడలు వచ్చారు శంకరం గారి ఇంటికి—మరొక పంటి పిల్లతో. ఆడపిల్ల రాలేదు. తీరిక లేదని ఉత్తరం వ్రాసింది. పండగ రోజులు ఆనందంగా గడిచాయి. మరునాడు ప్రయాణ మవుతున్న కొడుకుతో అంది అనసూయమ్మ: "మీ నాన్నగారు రెండు నెలల్లో రిటైరవుతున్నారురా."

"దాని దేముందమ్మా!" మీరు నా దగ్గరికి వచ్చి ఉండండి." వెంటనే జవాబిచ్చాడు కొడుకు.

"అది కాదురా. తమ్ముడి బరువు ఇంకా ఉంది. రంగడి సంగతి నీకు తెలుసు కదా? ఎలా రాగలమ్మ వస్తు?" అంది అనునయంగా.


చిరకాలము నిలిచియుండు
పరిమళమునకు మరియు
రోజంతా తాజాగా ఉండుటకు
"రంభ" మరికొళందు అత్తరు
మరియు లగరీ టాల్క్




100 గ్రాముల డబ్బా లగ్జరీ టాల్క్
చిల్లర ధర రు 6-50 కు మించదు. స్థానిక పన్నులు అదనం.

4 Ml సీసా చిల్లర ధర
రు. 7-50 కు మించదు.

మరికొళందు చిన్న సైజు రు. 1-30
మరికొళందు పెద్దసైజు రు 5-25
స్థానిక పన్నులు అదనం.
ఇంకను 32 ఇతర రకముల అత్తరుల
కూడ తయారు చేయుచున్నాము.
ఉత్పత్తిదార్లు :
మెస్సర్స్ రంభ కాస్మెటిక్స్
అడయార్, మద్రాసు .600 020.

ఆంధ్రప్రదేశ్ మరియు ఒరిస్సాకు ఏజంట్లు :
మెస్సర్స్ నరేంద్ర ఏజన్సీస్
దుర్గాగ్రహారం, విజయవాడ—520 002.

"తమ్ముణ్ణి హాస్టల్‌లో పెట్టి చదివిద్దాం, అమ్మా. నాన్నగారి గ్రాట్యుయిటీ డబ్బూ అదీ వాడికి చాలకపోదు. పోతే..."

ఆశగా, ఆ(తతగా కొడుకు ముఖంలోకి చూసింది అనసూయమ్మ — ఏం చెబుతాడో అని.

"రంగడి సంగతి. వాణ్ణి వికలాంగులను చూసే ఏ ఆశ్రమానికో పంపించేద్దాం. అక్కడ వాడిని లాలనగా చూస్తారు" అన్నాడు తల్లికి ధైర్యం చెపుతూ.

అనసూయమ్మ మనసు గాయపడింది.

తాను ఉండగా వాడు అనాథలాగా ఎక్కడో పెరగాలా!

ఆమె బాధతో విలవిలలాడిపోయింది.

తల్లి మౌనంగా ఉండిపోయేసరికి మళ్ళీ నచ్చ చెపుతూ అన్నాడు కొడుకు: "వాడికి మనం తిండి, బట్ట ఇస్తాం. వాడి అవసరాలన్నీ మనమే తీరుస్తాం. వాడి నిలా మూల కూర్చోబెట్టి ఎన్నాళ్ళు ఉంచితే ప్రయోజనం ఏముంటుంది, చెప్పు? అక్కడ ఉంటే వాడికి కొంత వికాసం కలగవచ్చు."

ఆ నాటికి ఆ ప్రస్తావన అంతటితో ఆగి పోయింది.

మరునాడు శంకరంగారి పెద్ద కొడుకు భార్యా పిల్లలతో ప్రయాణమై వెళ్ళిపోయాడు.

* * * *

శంకరంగారు రిటైరయ్యారు. రిటైరయ్యి కొత్తలో ఫరవాలేకపోయింది కానీ, రాను రాను రోజుల గడవడం సమస్యగా తయారయింది. కొడుకునుంచి తన దగ్గరికి వచ్చేయమని ఉత్తరాలు వస్తున్నాయి.

ఇక్కడ ఉండి బాధలు పడే కన్న కొడుకు దగ్గరికి వెళ్ళి ఉండడమే మంచిదనే నిర్ణయానికి వచ్చారు శంకరంగారు.

చిన్నవాణ్ణి హాస్టల్లో జాయిన్ చేసి, రంగణ్ణి, భార్యనూ తీసుకొని పెద్ద కొడుకు దగ్గరికి చేరారు.

రంగణ్ణి చూసిన క్షణం నుంచి విసుక్కోవడం ప్రారంభించింది కోడలు. అత్తమామల విషయంలో లోకానికి భయపడి ఊరుకుంది కాని, ఆవిడ కసిలు వారి రాక సుతరామూ నచ్చలేదు. కాని, తన అక్క సంతా కాళ్ళు లేని రంగడి మీద చూపించేది. వాడిని సూటిపోటి మాట లంటూ వాడిపై విరుచుకు పడేది.

కాలిన శరీరం మీద చిత్రిక పట్టినట్లయింది వాడికి— ఆమె పెట్టే చీవాట్లకు, తిట్టే తిట్లకు.

వారం దినా లయేసరికి రంగడు మరి అక్కడ ఉండలేని పరిస్థితి ఏర్పడింది. శంకరంగారు పెద్ద కొడుకుతో వాడి విషయమై సంప్రదించారు.

తరవాత వారంలోగానే రంగడిని తిండి, బస ఉండే వికలాంగుల పాఠశాలలో చేర్పించారు.

ఎప్పుడూ తల్లినీ, తండ్రినీ వదిలి ఉండని రంగడికి ఈ ఒంటరితనం బాధ కలిగించింది.

గూడు లేని పక్షిలా అయింది వాడి స్థితి.

వాడు ఉన్న పాఠశాలలో విద్యార్థుల అభిరుచి అనుసరించి చదువు నేర్పేవారు. కాని, వయసు పెరిగిన రంగడికి చదువు రుచించలేదు. అయినా, ఆ ఆశ్రమమే తల్లీ తండ్రీగా, తన సర్వస్వంగా తలుచు కుంటూ కాలం గడిపేవాడు.

కాలచక్రంలో రోజులు క్రిందా, మీదా దొర్లుతూ మరో మూడేళ్ళు గడిచాయి. రంగడిని విడిచిన నాటి నుంచి చావలేక బ్రతుకుతూ గడుపు తున్నారు శంకరం, అనసూయమ్మగార్లు. వారి కళ్ళు నిరంతరం రంగడినే వెతికేవి.

కాళ్ళు లేని రంగడిని కాళ్ళున్న వారే ఆదుకో లేదు; అభిమానించి ఆదరించలేదు.

ఎలా బ్రతుకుతున్నాడో అక్కడ! అదే వారి వ్యథ!

* * *

రాత్రి తొమ్మిది గంట లయింది.

రేడియోలో ప్రత్యేకంగా సంగీత విద్వాంసుల కచేరీ వస్తూంది ఆ వేళ. 'ఈ నాటి కచేరీ శ్రీ రంగ నాథం గారిది' అని చెప్పిన మాటలు శ్రద్ధగా వింటున్న శంకరం, అనసూయమ్మ గార్లను ఆక ర్షించాయి.

"నను పాలింప నడచి వచ్చితివో ..." అనే కృతికి స్వర కల్పన చేసి పాడుతూంటే విని పులకించి పోయారు. ఆ రాత్రంతా వారిద్దరికీ అవే ఊహలు. దేవుడు కనికరించి, రంగడికి కాళ్ళు వచ్చేలా చేస్తే—

కదలి వచ్చే దేవుడు కాలూత నివ్వడూ?

* * *






మరునాడు మధ్యాహ్నం నాలుగయింది. టాక్సీ వచ్చి ఇంటి ముందు ఆగింది. డ్రైవరు, మరొక వ్యక్తి కలిసి రంగడిని తీసుకువచ్చి, ఆ ఇంట్లో విడిచి నమస్కరించి నిలుచున్నారు. రంగడు వాళ్ళ నింక వెళ్ళిరమ్మని చెప్పాక వాళ్ళు వెళ్ళిపోయారు.

అకస్మాత్తుగా వచ్చిన రంగణ్ణి చూసి అనసూయమ్మ, శంకరం గారలకు ఆనందం, ఆశ్చర్యం ముప్పిరి గొన్నాయి. వారి కళ్ళు వేయి విద్యుద్దీపాల్లా వెలిగాయి.

ఆత్రతగా వచ్చి వాణ్ణి వాటేసుకుని, కన్నీళ్ళతో ముంచెత్తింది అనసూయమ్మ.

ఆప్యాయంగా వాణ్ణి చేరదీసి, తల నిమిరి, "రంగా! కారులో వచ్చావు — ఎవరు పంపించార్రా నిన్ను?" అని అడిగారు శంకరంగారు.

"నాన్నా! నా కో మంచి అవకాశం వచ్చింది."

"అవకాశం — ఏమిట్రా అది?!" విస్తుపోతూ అడిగారు.

"నన్ను సినిమాలో పాడేందుకు సహాయ గాయకుడుగా రమ్మన్నారు, నాన్నా."

"సినిమాల్లోనా!" ఆశ్చర్యపోతూ ఒకేసారి అన్నారు అనసూయమ్మ, శంకరంగార్లు.

"వూఁ." తల వూపాడు రంగడు.

ఆశ్చర్యం నుంచి శంకరంగారే ముందుగా తేరుకున్నారు.

"నీకు ... నీకు సంగీతం ఎవరు నేర్పారురా?!" ఇంట్లో ఉండేటప్పుడు ఏవో కూనిరాగాలు తీయడం తప్పిస్తే, వాడి గొంతులో శ్రావ్యత ఉందని, కళా రంగానికి అంకితం కాగల స్వరం వాడిలో ఉందన్న ఆలోచన తమ కెవరికీ వూహకయినా రాలేదు. అందుకే కుతూహలంగా అడిగా రాయన.

మట్టిలోనుంచి మాణిక్యాన్ని వెలికితీసిన ఆ ఔన్నత్యం ఎవరికి ఉందా అని తెలుసుకోవాలన్న కుతూహలం అది.

"ఆశ్రమానికి దగ్గరగా శ్రీపతిగారనే సంగీత విద్వాంసులు ఉన్నారు, నాన్నా. ఆయన ఎప్పుడూ సంగీత సాధన చేస్తూ, ఎన్నో కచేరీలకు వెళ్ళేవారు. అనాథ బాలబాలికలకు సహాయం చేస్తూ, తరుచుగా ఆశ్రమానికి వస్తుండే వారు. ఒకసారి మా ఆశ్రమంలో చిన్న పాటల పోటీ జరిగింది. అప్పు డాయన అక్కడే ఉన్నారు. ఆ సాయంత్రం నన్ను తనతో వాళ్ళ ఇంటికి రమ్మన్నారు. వారి పిలుపు నా కెంతో ఆనందాన్ని ఇచ్చింది. ఆయన తన వద్ద నన్ను కూర్చో పెట్టుకుని, తను పాడుతూ, నన్ను పాడించే వారు. నన్ను తనతో ప్రతి చోటుకూ తీసుకు వెళ్ళేవారు. వారి సన్నిధిలో నాకు కాలం తెలిసేది కాదు. వారికి పిల్లలు లేరు, నాన్నా. ఒక కొడుకు కలిగినా, ఏక్సిడెంటులో కాళ్ళు పోగొట్టుకుని, ఆ తరవాత హాస్పిటల్‌లోనే చనిపోయాడట. వారు నన్ను 'హరీ!' అని పిలిచేవారు, నాన్నా! అమ్మగారు, ఆయన నన్నెంతగానో అభిమానించే వారు. వారే ఆదరించి నా కీ భిక్ష పెట్టారు, నాన్నా."

ఆ మాటలు వింటున్న శంకరంగారు గతుక్కుమన్నారు.

"ఎవరూ? శ్రీపతిగారా?!"

"అవునండీ. మీకు తెలుసా?"

"ఆయన భార్య పేరు శారదమ్మ కదూ?"

ఆశ్చర్యంతో అవునన్నట్టు తల వూపాడు రంగడు.

"చనిపోయిన వాళ్ళ అబ్బాయి హరి కదూ?"

"వూఁ."

గతం గుర్తుకు రాగా తలుచుకొని కన్నీరు కారుస్తూ ఉండిపోయారు శంకరంగారు.

"నాన్నా! మీ రెందుకో బాధపడుతున్నారు. చెప్పరూ? ఆయన మీకు తెలుసా?"

"తెలుసు, రంగా. శ్రీపతీ, నేనూ కలిసి చదువుకున్నాం. సంగీత మంటే వాడికి అభిమానం. చదువు పూర్తి కాకుండానే సంగీతంలో పడి అదేపనిగా నేర్చుకున్నాడు. సంగీత విద్వాంసు డయ్యాడు. పేరు ప్రఖ్యాతులతోబాటు అంతులేని ఆస్తి సంపాదించాడు.

"నువ్వు పుట్టి మూడేళ్ళయినా నీకు నడక రాలేదు. తిరుపతి దేవుడికి మొక్కుకున్నాం. దారిలో శ్రీపతి ఇంట్లో దిగాము. వాళ్ళూ ప్రయాణమై మాతో తిరుపతి వచ్చారు.

"దైవ దర్శనం పూర్తి చేసుకుని క్రిందికి నడిచి వస్తూ ఉంటే నిన్నెత్తుకోలేక మీ అమ్మ శ్రమ పడుతూ ఉంటే — నిన్ను శారదమ్మ అందుకుంది. వాళ్ళ హరి ముందుగా గట్టుమీద నుంచి పరుగెత్తి, ఒరిగి, పక్కనున్న లోయలో పడ్డాడు. కాళ్ళు విరిగి పోయాయి. పెద్ద దెబ్బలే తగిలాయి. శ్రీపతీ, నేనూ వాణ్ణి హాస్పిటల్‌లో జాయిన్ చేశాము. కాని వాడు దక్కలేదు." ఉద్వేగంగా చెబుతూ, కన్నీళ్ళతో ముఖం దించుకున్నారు శంకరంగారు.

"ఆ తరవాత శ్రీపతి హైదరాబాద్ వెళ్ళి పోయాడు. మరి మేము కలియలేదు."

అనసూయమ్మ బాధగా నిట్టూర్చి, కన్నీళ్ళు తుడుచుకుంది.

రంగడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"శ్రీపతి ఇన్నాళ్ళకు తిరిగి ఈ ప్రాంతంలోనే ఉన్నాడని తెలిసి ఎంత ఆనందంగా ఉందో! హరి బతికి ఉంటే నీ వయసు ఉంటుంది వాడి కిప్పుడు, హరి లేని లోటు నీలో చూసుకోవడమే కాక తన సంగీత విద్య నీకూ నేర్పి, నిన్నొక మనిషిని చేసి, నీలో కొత్త చైతన్యం నింపాడు. నీకు కొత్త జీవితాన్ని ప్రసాదించాడు." శంకరం గారి మనసు ఆర్ద్రంగా తయారై మాటలు కరవయ్యాయి.

"అన్నట్టు, నాన్నా నిన్న రాత్రి రేడియోలో కచేరీ వచ్చింది. మీరు విన్నారా?" హటాత్తుగా గుర్తు వచ్చి అడిగాడు రంగడు.

"వూఁ." తల వూపారు శంకరంగారు.

"ఆ ప్రోగ్రామ్ నే నిచ్చిందే, నాన్నా. ఇదివరకు కూడా ఒకటి, రెండు పర్యాయాలు రేడియోలో ప్రోగ్రామ్ ఇచ్చాను. ఇది కూడా శ్రీపతిగారి వల్ల వచ్చిన అవకాశమే." చెప్పాడు రంగడు.

"నను పాలింప నడచి వచ్చితివో ..." తాము తన్మయులయి విన్న ఆ గాత్రం గుర్తు వచ్చింది అనసూయమ్మ, శంకరంగార్లకు. ఆనందంతో తల మునక లయ్యారు.

"మనల్ని ఆదుకునేందుకు ఆ స్వామి దిగిరా నక్కర లేదురా, రంగా. మనుషుల్లోనే ఆ దైవత్వం నిండిన వాళ్ళు ఉంటారు. శ్రీపతి లాంటి వాళ్ళు. ఆ స్వామి పంపిస్తా డలాంటి వాళ్ళను." శంకరంగారి గుండె శ్రీపతిని తలుచుకుని కృతజ్ఞతాభారంతో నిండిపోయింది.

* * *

ఆ తరవాత అనసూయమ్మగారు, శంకరంగారు రంగడితోబాటు శ్రీపతి గారి ఇంటికి దగ్గరలోనే ఒక ఇల్లు చూసుకుని, అందులోకి మారి పోయారు. కాళ్ళు లేని రంగడు తల్లిదండ్రులకు కాలూత అయ్యాడు.

ఆ వేళ — వాకిట్లో కారు ఆగింది.

"అమ్మా! నా కీ వేళ స్టూడియోలో రికార్డింగు ఉంది. నువ్వు కూడా రా, అమ్మా. నాతో తీసుకు వెళతాను" అన్నాడు రంగడు.

"మేము నీతో ఎందుకురా?" అన్నారు శంకరం గారు, ఆనందం పొంగుతు వస్తూ ఉంటే.

"అది కాదు, నాన్నా. అమ్మకు సరదా. అలా స్టూడియో చూసినట్టూ ఉంటుంది, నా పాట విన్నట్టూ ఉంటుంది." తల్లివేపు అభిమానంగా చూస్తూ అన్నాడు రంగడు.

రంగడితోబాటు అనసూయమ్మగారు కారువైపు కదిలారు.

సముద్రం మీద నావలా కారు ముందుకు సాగింది. ★

